





బెంబేలెత్తిస్తున్న గ్రామసింహాలు..!

జిల్లా కేంద్రంలో వీధికుక్కల సంచారంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గుంపులుగా తిరుగుతూ మనుషులపై దాడి చేస్తున్నాయి. పిల్లలు, మహిళలు, వృద్ధులు రోడ్లపై తిరగాలంటే జంకుతున్నారు. కుక్కల బెడద తీర్చాలని మున్సిపాలిటీ వారికి ఫిర్యాదులు చేస్తున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, మంచిర్యాల

క్లుప్తంగా

'మటన్ వ్యర్థాలు బయట పడేయొద్దు'



మాట్లాడుతున్న కమిషనర్

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మటన్, చికెన్, చేపల విక్రయదారులతో మున్సిపల్ అధికారులు సోమవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. చికెన్, మటన్, చేపల వ్యర్థాలను ఎట్టి పరిస్థితిల్లో బయట పడేయవద్దని, వాటి కారణంగా వీధికుక్కలు చేరి ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతాయని కమిషనర్ వెంకటనారాయణ పేర్కొన్నారు. బహిరంగ ప్రాంతాల్లో వ్యర్థాలను పడేస్తే జరిమానాలు విధిస్తామని అవసరమైతే షాపు లైసెన్స్ రద్దుచేస్తామని హెచ్చరించారు. పందుల పెంపకందారులతోనూ మాట్లాడుతూ పట్టణానికి ఐదు కిలోమీటర్ల దూరంలో పందులను తరలించాలని సూచించారు.

జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

మందమర్రిరూరల్: మండలంలోని సారంగపల్లిలో గల ప్రభుత్వ క్రీడా ప్రాంగణంలో సోమవారం జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను ఎస్సై చంద్రకుమార్ ప్రారంభించారు. బాల్క ఫౌండేషన్ ఆధ్వర్యంలో లీగ్ కం నాకౌట్ పద్ధతిలో జరిగే ఈ పోటీలకు 50 టీంలు తలబడుతున్నాయని, విన్నర్ టీంకు రూ.30వేలు, రన్నర్ టీంకు రూ.10వేలు బహుమతి అందించనున్నట్లు నిర్వాహకులు సంజీవరావు, ఫిరోజ్, సంతోష్ తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రవి, పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్‌రావు, వైస్ ఎంపీపీ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఆదివాసీల వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

భీమారం: జిల్లాలో ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ బధావత్ సంతోష్‌ను కోరుతూ జిల్లా ఆదివాసీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆత్రం వెంకటరాజంతో పాటు నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కుర్సింగ వెంకటేష్, మహిళా నాయకులు సుశీలతో పాటు పలువురు పాల్గొన్నారు.

ముందస్తు టీకాలు వేయించాలి



మందులు వేస్తున్న జిల్లా పశువైద్యాధికారి

లక్సెట్టిపేట/కాసిపేట: పశువులు వ్యాధుల బారిన పడకుండా ముందస్తుగా వాటికి టీకాలు, మందులు వేయించాలని జిల్లా పశువైద్యాధికారి రమేశ్‌బాబు పేర్కొన్నారు. లక్సెట్టిపేట మండలంలో గొర్రెలు, మేకల్లో వచ్చే వ్యాధులు, వాటి నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం అవగాహన కల్పించారు. అనంతరం పలు గ్రామాల్లో నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. కాసిపేటలో మండలంలో సోమగూడెం(కె)తీలో పశువులకు నట్టల నివారణ మందుల పంపిణీని సర్పంచ్ శంకర్ ప్రారంభించారు. కార్యక్రమాల్లో పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ చట్టాలపై అవగాహన కల్పించాలి



రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: ర్యాగింగ్ చట్టాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి డిమాండ్ చేశారు. వైద్య విద్యార్థి ప్రీతి, ఇంజనీరింగ్ విద్యార్థి రక్షిత ఆత్మహత్యలకు కారణమైన నిందితులను శిక్షించాలని సోమవారం మంచిర్యాల పట్టణంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. బెల్లంపల్లి చౌరస్తాలో రాస్తారోకో చేపట్టారు. నిందితులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉన్నత చదువులు చదువుతున్న విద్యార్థినులు ర్యాగింగ్‌కు బలవుతున్నారన్నారు. మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో నస్పూర్ మండల కార్యదర్శి అభినవ్, మండల నాయకుడు రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రీతి మృతిపై విచారణ జరిపించండి'

మందమర్రిరూరల్: మెడికో విద్యార్థిని ప్రీతి మృతిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని నేతకాని మహర్ సంఘం జిల్లా ఇన్‌చార్జి సునార్కర్ రాంబాబు డిమాండ్ చేశారు. స్థానికంగా సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రీతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రభుత్వం వైఫల్యం వల్లనే దళిత బిడ్డలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రీతి ఆత్మహత్యకు కారకులైన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గోలేటి లక్ష్మి, సుధాకర్, మహేశ్వరి, వరుణ్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.



చెన్నూర్ గాంధీచౌక్‌లో సైఫ్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

ప్రీతి మృతికి కారకులను శిక్షించాలి

శ్రీరాంపూర్: ప్రీతి చావుకు కారణమైన సీనియర్ విద్యార్థి మహమ్మద్ సైఫ్‌ను కఠినంగా శిక్షించాలని సేవాలాల్ సేన రాష్ట్ర మహిళా కార్యదర్శి భానవత్ సరోజ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గిరిజన బిడ్డలకు రక్షణ కల్పించాలని కోరారు.

తాండూర్: ప్రీతి మృతికి కారణమైన వారిని శిక్షించాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కృష్ణ దేవరాయలు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సీనియర్ విద్యార్థి సైఫ్ వేధింపుల కారణంగానే ప్రీతి మృతి చెందిందని ఆరోపించారు. నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునఃరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పాతమంచిర్యాల: ప్రీతి మృతికి కారకులైన వారిని శిక్షించాలని సేవాలాల్ సేనా రాష్ట్ర మహిళా కార్యదర్శి బానవత్ సరోజ డిమాండ్ చేశారు. ఆమె వెంట సేవాలాల్ సేనా మహిళా నాయకురాళ్లు రేణుకా, జమున పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో సైఫ్ దిష్టిబొమ్మ దహనం

చెన్నూర్: కాకతీయ మెడికల్ విద్యార్థిని ప్రీతి ఆత్మహత్యకు కారణమైన సైఫ్‌ను ఉరితీయాలని ఏబీవీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ మామిడి అక్షిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రీతి మృతికి నిరసనగా స్థానిక గాంధీచౌక్‌లో ఏబీవీపీ ఆధ్వర్యంలో సైఫ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో బీజేవైఎం పట్టణ జనరల్ సంజయ్‌కుమార్, పట్టణ నాయకులు గడ్డం సుధాకర్, ఆర్ఎస్ఎస్ నాయకులు లట్టి రాజబాపు, ఏబీవీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నేతకాని సంఘం నాయకులు

'ప్రజావాణి' సద్వినియోగం చేసుకోవాలి



భీమిని: మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో నరేందర్



నెన్నెల: దరఖాస్తులు స్వీకరిస్తున్న ఆర్డీవో

భీమిని/కోటపల్లి/చెన్నూర్‌రూరల్/భీమారం/నెన్నెల: ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీసీఈవో నరేందర్ సూచించారు. జిల్లాలోని పలు మండలాల్లో సోమవారం ప్రజావాణి నిర్వహించగా, పలువురు అధికారులు హాజరై దరఖాస్తులు స్వీకరించారు. కన్నెపల్లి మండలంలో నిర్వహించిన గ్రీవెన్స్‌ను జెడ్పీసీఈవో నరేందర్ పరిశీలించగా ఏ ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. కోటపల్లిలో నిర్వహించిన ప్రజావాణిని ఎంపీడీవో భాస్కర్, ఎంపీపీ మంత్రి సురేఖా సందర్శించారు. అధికారులు హాజరుకాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చెన్నూర్, భీమారంలో నిర్వహించిన ప్రజావాణికి స్పందన కరువయ్యింది. నెన్నెలలో వచ్చిన ఫిర్యాదులకు సంబంధించిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని బెల్లంపల్లి ఆర్డీవో శ్యామలాదేవి అధికారులకు సూచించారు. సమస్యలను ఎప్పటికప్పుడు వెంటనే పరిష్కరించాలని వివిధ శాఖల అధికారులకు ఆమె సూచించారు. భూ సమస్యకు సంబంధించిన రెండు దరఖాస్తులు వచ్చినట్లు ఆర్డీవో చెప్పారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బంద్ విజయవంతం

మంచిర్యాలటౌన్: మెడికో విద్యార్థిని ప్రీతి మృతికి కారణమైన సైఫ్‌ను కఠినంగా శిక్షించాలని, ర్యాగింగ్ భూతాన్ని అరికట్టాలని కోరుతూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపి) ఆధ్వర్యంలో మంచిర్యాల మెడికల్ కళాశాల బంద్ సోమవారం విజయవంతం అయ్యింది. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ బొప్పు శశికుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని విద్యార్థులకు రక్షణ లేకుండా పోయిందని, ర్యాగింగ్ భూతం విద్యార్థుల పాలిట శాపంగా మారిందని ఆరోపించారు. ప్రీతి కుటుంబానికి న్యాయం చేయాలని, ఇందుకు కారణమైన సైఫ్‌ను పదేళ్ల పాటు చదువు నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి శేఖర్, వంశీ, శివ, మణికంఠ పాల్గొన్నారు.

కరాటే చాంపియన్‌షిప్‌లో ప్రతిభ

మంచిర్యాలటౌన్: నేషనల్ ఇన్విటేషన్ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ 2023 పోటీలను బెల్లంపల్లిలో ఈ నెల 26వ తేదీన నిర్వహించగా జిల్లా కేంద్రానికి చెందిన 50మంది విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబర్చినట్లు కరాటే మాస్టర్ వడ్లకొండ భారతి తెలిపారు. కరాటే పోటీల్లో 9మంది విద్యార్థినులు ప్రథమ స్థానంలో, 20మంది విద్యార్థులు ద్వితీయ స్థానంలో, 19మంది విద్యార్థినులు తృతీయ స్థానంలో గెలుపొందినట్లు తెలిపారు. గెలుపొందిన విద్యార్థులను సీనియర్ మాస్టర్ వి.రవి, అట్టె మధునయ్య అభినందించారు.



బీఆర్ఎస్‌తోనే పల్లెలు అభివృద్ధి

● ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

వేమనపల్లి: బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రమేయం వల్లనే పల్లెలు అభివృద్ధి చెందుతున్నాయని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో తాపీమేస్త్రీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం నీల్వాయిలోని ప్రైమరీ పాఠశాలలో 'మనఊరు–మనబడి' కార్యక్రమంలో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. రాచర్లలో రూ.18లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ సత్యనారాయణ, బెల్లంపల్లి వ్యవసాయ కమిటీ చైర్మన్ నిరంజన్ గుప్తా, వైస్ చైర్మన్ లింగాగౌడ్, సర్పంచ్ రాజలింగు, ఉపసర్పంచ్ పున్నం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

సాదాసీదాగా నస్పూర్ మున్సిపల్ సమావేశం

నస్పూర్: మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం సాదాసీదాగా ముగిసింది. సమావేశంలో ఎజెండాలో పొందుపరిచిన 28అంశాలపై కౌన్సిల్ సభ్యులు చర్చించి వాటిని ఆమోదించారు. చర్చ సందర్భంగా కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ సురిమిల్ల వేణు మాట్లాడుతూ పట్టణంలోని కొన్ని వార్డుల్లో మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. వచ్చే వేసవి కాలం దృష్ట్యా తాగు నీటి సమస్యను తీర్చాలని కోరారు. పట్టణంలో వీధికుక్కల బెడద తీర్చడానికి తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కమిషనర్ రమేష్, పలువురు కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, ఆర్‌వో సతీష్, ఏఈ మధు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న చైర్మన్, కమిషనర్

పారిశుధ్య నిర్వహణకు స్పెషల్‌డ్రైవ్

బెల్లంపల్లి: స్థానిక మున్సిపల్ సాధారణ సమావేశం సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత అధ్యక్షతన నిర్వహించగా సాదాసీదాగా సాగింది. సభ్యులు సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. మున్సిపాలిటీలో ప్రజలకు ఇబ్బందికరంగా మారిన కుక్కలు, పందుల నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని, మున్సిపాలిటీ వ్యాప్తంగా 34 వార్డుల్లో మురుగు నీటి కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టడంతో పాటు, పారిశుధ్యం నిర్వహణకు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని తీర్మానాలు చేశారు. అజెండాలో పొందు పర్చిన పలు అంశాలపై సభ్యులు చర్చించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, మున్సిపల్ అధికారులు, కౌన్సెల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న చైర్‌పర్సన్ శ్వేత

మిషన్ భగీరథ పనులు పూర్తి చేయాలి

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీలో మిషన్ భగీరథ పనులతో రోడ్లు మొత్తం ధ్వంసం అయ్యాయని, ఇంటింటికీ నల్లా కనెక్షన్లు ఇచ్చే కార్యక్రమం నెలల కొద్ది కొనసాగడం వల్ల ప్రజలకు ఇబ్బందిగా మారుతోందని, పనులను వెంటనే పూర్తి చేయాలంటూ వార్డు కౌన్సిలర్లు మిషన్ భగీరథ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీలోని మిషన్ భగీరథ పనులపై సోమవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ పెంట రాజయ్య ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్లు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, రోడ్లన్నింటినీ తవ్వి వదిలేశారని, ఇష్టారాజ్యంగా చేసే పనులతో అప్పటికే తాగునీరు అందిస్తున్న పైపులు పగిలిపోయి, తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. తవ్విన రోడ్లను వేయడంలోనూ ఆలస్యం చేయడం వల్ల ఆ గుంతల రోడ్లతో ప్రజలు, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని, వర్షాకాలం రాకముందే పనులన్నింటినీ పూర్తి చేయాలన్నారు.



మిషన్ భగీరథ, కౌన్సిలర్లతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య

'భూ నిర్వాసితులకు మొత్తం పరిహారం చెల్లించాలి'

నస్పూర్: శ్రీరాంపూర్ ఓసి నిర్వాసిత గ్రామాలైన తాళ్లపల్లి, సింగాపూర్ గ్రామాల ప్రజలకు రావాల్సిన మొత్తం పరిహారాన్ని వెంటనే చెల్లించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ డిమాండ్ చేశారు. ప్రజాగోస–బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా సింగాపూర్ ఆర్అండ్ ఆర్ కాలనీ, సుందరయ్య కాలనీలో కార్నర్ మీటింగ్ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ ఓపెన్ కాస్ట్ భూ నిర్వాసితులకు నష్టపరిహారం ఇవ్వకుండా వారికి సింగరేణి యాజమాన్యం అన్యాయం చేస్తుందని ఆరోపించారు.

'రానున్నది బీజేపీ ప్రభుత్వమే'

భీమిని: తెలంగాణలో రానున్నది బీజేపీ ప్రభుత్వమేనని కొయ్యాల ఏమాజీ అన్నారు. మండలంలోని వెంకటాపూర్‌లో సోమవారం ప్రజాగోస–బీజేపీ భరోసా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అనంతరం వెంకటాపూర్ గ్రామం నుంచి బీజేపీలో చేరిన పలువురికి కండువా కప్పి ఆహ్వానించారు.

మరమ్మతు చేశారు



సాక్షి ఎఫెక్ట్..

దండేపల్లి: మండలంలోని మేదరిపేట నుంచి మామిడిపల్లికి వెళ్లే రోడ్డు పక్కన భగీరథ పైప్‌లైన్ కట్ అయి నీళ్లు వృథాగా పోయాయి. దీనిపై 'భగీరథ.. నీళ్లు వృథా' అనే కథనాన్ని 'సాక్షి' సోమవారం ప్రచురించగా, సంబంధిత అధికారులు స్పందించి పైప్‌లైన్ కట్ అయిన చోట మరమ్మతు చేసి, నీటి వృథాను అరికట్టారు.

సంక్షిప్త వార్తలు

'అభ్యంతరాలు ఉంటే తెలపండి'

మందమర్రిరూరల్: క్యాతన్‌పల్లి, మందమర్రి మున్సిపాలిటీల పరిధిలోని డబుల్ బెడ్రూం ఇళ్ల జాబితాపై అభ్యంతరాలు ఉంటే మార్చి 1, 2, 3 తేదీల్లో మున్సిపల్ కార్యాలయంలో తెలియజేయాలని మందమర్రి తహసీల్దార్ సంపతి శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆడపిల్లల రక్షణ మనందరి బాధ్యత

నస్పూర్: ఆడపిల్లల రక్షణ మన అందరి బాద్యత అని వనితా వాక్కు ఫౌండేషన్ ఫౌండర్ రంగు వేణు కుమార్ అన్నారు. ఫౌండేషన్ సభ్యులతో కలిసి సోమవారం ఆయన నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. నేటి సమాజంలో బాలికలు, ఆడపిల్లలపై అఘాయిత్యాలు పెరిగిపోయాయని ఆవేదన చెందారు. అఘాయిత్యాల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆడ పిల్లల్లో వారి చిన్నతనం నుంచే ఆత్మస్థైర్యాన్ని పెంపొందించాలని, ఆ దిశగా వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. సమావేశంలో ఫౌండర్స్ జోత్స్న చంద్రదత్, కవిత, శైలజ, రూప, రజిని తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాటక ప్రదర్శన

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని జెడ్పీపాఠశాలలో సోమవారం అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ హైదరాబాద్ ఆధ్వర్యంలో జ్యోతి బా పూలే, సావిత్రి బాయి పూలే జీవిత చరిత్రపై నాటక ప్రదర్శన నిర్వహించారు.

ఆర్గనైజింగ్ కమిటీ సభ్యురాలిగా అక్షిత

చెన్నూర్: తిరుపతి జిల్లా మహతి ఆడిటోరియంలో ఏప్రిల్ 9, 10 తేదీల్లో 48గంటల పాటు నిర్వహించే ప్రపంచ తెలుగు సాహితి బ్రహ్మోత్సవాల ఆర్గనైజింగ్ కమిటీ సభ్యురాలిగా మంచిర్యాల జిల్లా చెన్నూర్‌కు చెందిన మామిడి అక్షితను నియమిస్తూ సోమవారం ప్రపంచ తెలుగు సాహిత్య, సాంస్కృతిక, అకాడమీ చైర్మన్ కత్తికొండ ప్రతాప్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎల్లమ్మతల్లికి ఎదుర్కోళ్లు

మంచిర్యాలఅర్బన్: స్థానిక పోచమ్మ చెరువు ఆలయంలో రేణుక ఎల్లమ్మ కల్యాణ మహోత్సవంలో భాగంగా సోమవారం ఎల్లమ్మతల్లి ఎదుర్కోళ్ల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సంజీవయ్య కాలనీ నుంచి భాజా భజంత్రీలతో ఎల్లమ్మతల్లిని ఎదుర్కొన్నారు. మంగళవారం సాయంత్రం జిల్లా పరిషత్ స్కూల్ నుంచి 5గంటలకు ఎల్లమ్మ బోనాలు కార్యక్రమం జరుగుతోందని మున్సిపల్ వైస్ చైర్మన్ గాజుల ముఖేష్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యుడు చంద్రమోహన్‌గౌడ్, సందీప్, జీవన్‌గౌడ్, బాలుగౌడ్, రాజాగౌడ్, లచ్చగౌడ్, ప్రకాశ్‌గౌడ్, పండరీగౌడ్ పాల్గొన్నారు.

పొలంబాట పట్టిన ఎమ్మెల్యే

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని గిరిజన గ్రామాల్లో సోమవారం ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు సీఎం గిరి వికాస్ కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. ర్యాలీ గ్రామంలోని పెద్ద గోపాల్‌పూర్ గ్రామ శివారులోని పంట పొలాల సమీపంలో బోర్‌వెల్ ఏర్పాటుకు ఎమ్మెల్యే దివాకర్‌రావు ఇలా పొలం గట్లు, ఎత్తుపల్లాలు దాటుకుంటూ వెళ్లి మరీ బోర్‌వెల్ పాయింట్‌ను ప్రారంభించారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ స్వర్ణలత, వైస్ ఎంపీపీ రమాదేవి, పీఏసీఎస్ చైర్మన్ సందెల వెంకటేశ్, మార్కెట్ కమిటీ చైర్మన్ సాగి వెంకటేశ్వర్‌రావు, మాజీ వైస్ ఎంపీపీ మందపల్లి శ్రీనివాస్, ఎంపీటీసీ జాడి వెంకటేశ్, ఎంపీపీ కో ఆప్షన్ రఫీక్, ఎస్సై ఉదయ్‌కిరణ్ ఉన్నారు. అనంతరం గఢ్‌పూర్‌లో నివాసం ఉంటూ ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురైన రాజకీయ స్నేహితుడు జాల మల్లయ్యను ఆయన పరామర్శించారు.



సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మంచిర్యాల: 9010299065, 9951602823
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
తిరుపతి, ACO - 7997958206
మంచిర్యాల : సల్మాన్‌ఖాన్ - 7995855506
చెన్నూర్ : కృష్ణ - 8309865990
బెల్లంపల్లి : సంపత్ - 7036227114
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899